క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

చారకొండ: మండలంలోని జేపల్లి గ్రామానికి చెందిన వంకేశ్వరం లక్ష్మయ్య (45) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట సర్పంచ్ రవీందర్ రెడ్డి, నాయకులు నూర్‌పాల్ నాయక్, పవన్, జైపాల్‌నాయక్, తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా నేషనల్ హైవే పనులు



పెద్దకొత్తపల్లి: కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు ఏర్పాటు చేస్తున్న 167కే నేషనల్ హైవే పనులు మండలంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం మండల కేంద్రం నుంచి సాతాపూర్ వరకు రోడ్డు పనులు చేపట్టారు. రోడ్ల వెడల్పుతో పాటు సైడు డ్రెయినేజీలను నిర్మిస్తున్నారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లు విద్యుత్ లైన్లను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేస్తూ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి.

సీఎంను కలిసిన మండల నాయకులు



వెల్దండ: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆదివారం హైదరాబాదులోని ఆయన స్వగృహంలో సర్పంచ్ భూపతిరెడ్డితో పాటు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, సురేష్, శశిపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ కోదండరాంకు సన్మానం



చారకొండ: ఇటీవల గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా పదవి చేపట్టిన ప్రొఫెసర్ కోదండరాంను మండల కేంద్రానికి చెందిన, రంగారెడ్డి జిల్లా విద్యార్థి జనసమితి ప్రధాన కార్యదర్శి చింతపల్లి జంగయ్య గౌడ్ ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబొకెను అందజేసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

నూతన కమిటీ ఎన్నిక

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాలలో చైతన్య యువత మండలి నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొడుగు రమేష్, ఉపాధ్యక్షుడిగా సాయిప్రసాద్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దారోజు రాకేష్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సన్మానించారు.

ఎస్‌ఐగా రాములు

అచ్చంపేట రూరల్: పట్టణ ఎస్‌ఐగా విధులు నిర్వర్తించిన గోవర్ధన్ నారాయణపేట రూరల్‌గా, సిద్దాపూర్ ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ జోగులాంబ గద్వాల జిల్లా వీఆర్‌కు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో పట్టణ ఎస్‌ఐ రాములు, సిద్దాపూర్ ఎస్‌ఐగా పవన్‌కుమార్‌లు కేటాయిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి

తెలకపల్లి: మండలంలోని పెద్దూరు గ్రామానికి చెందిన కసిరెడ్డి దామోదర్‌రెడ్డి(86)ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామానికి మొదటి సర్పంచ్‌గా సేవలందించారని గ్రామస్తులు తెలిపారు. పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు నివాళులర్పించారు.

శివమాలాధారులకు అన్నదానం ప్రారంభం

కందనూలు: జిల్లా కేంద్రంలోని శివాలయంలో ఆకారపు వంశీయుల ఆధ్వర్యంలో శివమాలాధారులకు అన్నప్రసాద పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్నప్రసాద కమిటీ సభ్యుడు శంకరయ్య మాట్లాడుతూ శివరాత్రి వరకు ప్రతిరోజు మధ్యాహ్నం అన్నదానం చేస్తామన్నారు. భిక్షకు హాజరయ్యే స్వాములు సెల్: 9849426295 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



ఆరుతడిలో సిరుల పంటలు

- తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు
- మార్కెట్‌లో పచ్చజొన్న, ఆముదం ధాన్యానికి డిమాండ్



రైతు కర్నాటి సత్యం పొలంలో సాగుచేసిన పచ్చజొన్న పంట

ఉప్పునుంతల: పెరిగిపోతున్న పెట్టుబడులు, కూలీల కొరత తదితర ఇబ్బందులతో కష్టపడి పండించిన పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోవడం తదతర సమస్యలతో రైతులు సతమతమవుతూ గత్యంతరం లేని పరిస్థితిలో వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు. ఇటువంటి పరిస్థితిలో కొంతమంది రైతులు పెట్టుబడులను తగ్గించుకోవడంతో పాటు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న పచ్చజొన్న, ఆముదం పంటలను సాగుచేస్తూ లాభాలను పొందుతున్నారు. యాసంగి పంటగా రైతులు ఎక్కువ శాతం ఆరుతడి పంటగా వేరుశనగ సాగుచేస్తే నీళ్లు ఎక్కువగా ఉండి తరిపొలాల్లో మాత్రం వరి పంటను సాగుచేస్తున్నారు. ఆయా పంటల సాగుకు ఎకరాకు రూ.25 వేల పైబడి పెట్టుబడి అవుతుంది. ఈ క్రమంలో ఉప్పునుంతలకు చెందిన తిప్పర్తి జగన్‌మోహన్‌రెడ్డి అనే రైతు వరి పంటకు బదులుగా తమ తరి పొలంలో తక్కువ పెట్టుబడితో(ఎకరాకు రూ.10 వేలు) 4 ఎకరాల్లో పచ్చజొన్న పంటను సాగుచేయగా కర్నాటి సత్యం అనే రైతు తన మూడున్నర ఎకరాల తరిపొలంలో పచ్చ జొన్న పంటను సాగుచేశాడు. ప్రస్తుతం పంట కంకి దశలో ఉంది. మరో పదిహేను రోజుల్లో పంట చేతికొస్తుంది. తక్కువ కాల వ్యవధిలో ఎకరాకు ఏడు క్వింటాళ్ల పైబడి దిగుబడి వచ్చినా మిగతా పంటలకంటే బాగానే ఉంటుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు. మార్కెట్‌లో పచ్చ జొన్నకు విపరీతమైన డిమాండ్ ఉందని, క్వింటాల్‌కు రూ.6 వేల వరకు ధర ఉంది. రోడ్డు వెంట ఉన్న పొలాల్లో జొన్న పంటను సాగుచేయడంతో అందరి చూపు ఆ పంట పైనే ఉంది. తెలిసిన వారందరూ తమకు జొన్నలు కావాలంటూ రైతుల వెంట పడుతున్నారు. మండల పరిధిలోని దేవదారికుంట తండా తదితర గ్రామాల్లో కూడా కొంతమంది రైతులు పచ్చజొన్న పంటను సాగుచేశారు. అదేవిధంగా ఎడ్ల చిన్న బచ్చన్నగౌడ్ అనే రైతు తన ఎకరం పొలంలో మేలు రకం ఆముదం పంటను సాగుచేశాడు. ప్రస్తుతం పంట పెద్ద గెలలతో ఆశా జనకంగా ఉంది. యాసంగిలో ప్రతియేడు ఆముదం పంటను సాగుచేస్తున్న రైతు బచ్చన్నగౌడ్ తన అనుభవంతో ఎకరాకు 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని తెలిపాడు. ప్రస్తుతం మార్కెట్‌లో ఆముదం ధాన్యం క్వింటాల్‌కు రూ.5,500ల నుంచి రూ.6 వేల వరకు పలుకుతుంది. ఆయా పంటలను సాగుచేస్తే తక్కువ పెట్టుబడితోపాటు రిస్కు తక్కువగానే ఉంటుందని రైతులు అంటున్నారు.



రైతు బచ్చన్నగౌడ్ పొలంలో ఆశాజనకంగా ఉన్న ఆముదం పంట

ఎకరా పొలంలో ఆముదం



తన ఎకరా పొలంలో ఆరుతడి పంటగా ఆముదం పంటను సాగు చేశాను. ప్రస్తుతం కాత దశలో బాగానే ఉంది. పెట్టుబడి రూ.10 వేలు దాటలేదు. నీటి తడులు కూడా మిగతా పంటలకంటే తక్కువగా అవసరం పడుతుంది. నేను ప్రతియేటా యాసంగిలో ఆముదం పంటను సాగుచేస్తున్నాను. పెట్టుబడిపోనూ ఎకరాకు రూ.40 వేల వరకు మిగులుబాటు అవుతుంది. వేరుశనగ, వరి పంటలకు కష్టం ఎక్కువగా ఉంటుంది.

– ఎడ్ల చిన్న బచ్చన్నగౌడ్, రైతు, ఉప్పునుంతల

డిమాండ్ ఉన్న పంటలు సాగుచేస్తే లాభాలు..

రైతులు తెలివిగా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పచ్చజొన్న, సజ్జ, ఆముదం వంటి ఆరుతడి పంటలను సాగుచేస్తే మంచి లాభాలు పొందవచ్చు. ఆందరూ రైతులు ఒకే రకమైన పంటలను సాగుచేస్తే డిమాండ్ లేక గిట్టుబాటు ధర ఉండదు. చిరు ధాన్యాలతో పాటు ఆముదం వంటి నూనె గింజల పంటలను సాగుచేసే రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది.

– సునీత, మండల వ్యవసాయాధికారిణి, ఉప్పునుంతల

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బిజినేపల్లి: రాష్ట్రంలోనే పాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రత్యేక గుర్తింపు ఉందని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పాలెం వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1963–2023 పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని కుటుంబవివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. పూర్వవిద్యార్థులు ఒకే వేదికపై కలుసుకోవడం సంతోషకరమన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ వెంకటస్వామి, నాయకులు పాల్గొన్నారు.

వట్టెం వెంకన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే

బిజినేపల్లి: మండలంలోని వట్టెం వేంకటేశ్వర స్వామిని స్థానిక ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు.

ఎమ్మెల్యే పరామర్శ

తాడూరు: మండలంలోని ఐతోలు గ్రామానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాద్ 10 రోజుల కిందట గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి సంతాప సభలో పాల్గొని ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

పోటెత్తిన భక్తులు



పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. కొల్లాపూర్, గద్వాల, పెబ్బేరు, వనపర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి మేకపొట్టేళ్ళు, కోళ్లు బలిచ్చి నైవేద్యాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తగిన ఏర్పాటు చేశామని ఎండోమెంట్ అధికారి రంగారావు తెలిపారు.

నాటక రంగాన్ని బలోపేతం చేద్దాం



తాడూరు: నాటక రంగాన్ని బలోపేతం చేద్దామని జిల్లా నాటక సమాజాల సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు నిరంజన్, జీఎంఎస్ బ్రహ్మాచారి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా నాటక సమాజాల సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటక రంగ బలోపేతానికి సభ్యత్వ నమోదు చేపట్టాలని, జిల్లాలోని అన్ని నాటక సమాజాలు ఫిబ్రవరిలోగా పూర్తి చేసుకోవాలన్నారు. త్వరలో మూడు రోజుల పాటు రంగస్థల ఉత్సవాలు జిల్లా కేంద్రంలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాటక సమాజం సభ్యుడు రఘునందన్, వెంకటరామమ్మ, నర్సింహారెడ్డి, సత్యనారాయణ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ఒత్తిడితోనే సస్పెన్షన్ ఉత్తర్వులు

ఉప్పునుంతల: రాజకీయ ఒత్తిడితోనే తనను సస్పెన్షన్ చేశారని పెద్దాపూర్ సర్పంచు కొత్త శిరీష ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం చేశారనే అభియోగంపై డీపీఓ ఇచ్చిన షోకాజ్ నోటీసులకు సంబంధించిన అన్ని రికార్డులను సమర్పించి వివరణ ఇచ్చానని వివరించారు. జిల్లా అధికారులు పూర్తిస్థాయి విచారణ చేయకుండానే మరో నాలుగు రోజులు పదవీకాలం ముగిస్తున్నందున కేవలం రాజకీయ ఒత్తిడితోనే ఉద్దేశ్యంతోనే తనతో పాటు ఉపసర్పంచ్ అక్రమంగా సస్పెండ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు నర్సింహ్మారావు రాజకీయంగా తమను ఎదుర్కోలేకనే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశాడని వారు ఆరోపించారు.

చెర్కూర్‌లో హుండీ లెక్కింపు



వెల్దండ: మండలంలోని చెర్కూర్‌లో ఈదమ్మమాదాంత ఉత్సవాల ముగింపు అనంతరం ఆదివారం ఆలయంలో హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్నారు. ఆలయ అభివృద్ధికి గ్రామస్తులతో ఉత్సవ కమిటీ నిర్వాహకులు సమావేశం అయ్యారు. అన్ని హుండీల లెక్కింపు తర్వాత ఆదాయం వెల్లడిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామచంద్రయ్యతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా రామును ప్రకటించాలి

బిజినేపల్లి: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి కొడిదెల రామును ప్రకటించాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్ డిమాండు చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో క్రియాశీలక పాత్ర పోషించి, కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన రాముకే ఎంపీ టిక్కెట్ ఇవ్వాలని కోరారు. కరోనా సమయంలో పేదలకు అండగా ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహించారని పేర్కొన్నారు.

విద్యార్థినిపై పోలీసుల తీరు అమానుషం



కొల్లాపూర్: ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీరాణిపై పోలీసులు వ్యవహరించిన తీరు అమానుషమని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు కట్టా శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. హైదబాద్‌లోని వ్యవసాయ, ఉద్యాన యూనివర్సిటీలో హైకోర్టు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించడాన్ని నిరసిస్తూ శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే పోలీసులు ఝాన్సీరాణి జుట్టుపట్టుకొని లాక్కెళ్లడం దారుణమన్నారు. ఇటువంటి ఘటనలు సభ్యసమాజానికి సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం విచారణ చేసి పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు నాంచారిగౌడ్, ప్రభాకర్, శంకర్ తదితరులున్నారు.

సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహిద్దాం



కల్వకుర్తిరూరల్: గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహిద్దామని ఆ సంఘం నాయకులు కోరారు. పట్టణంలోని దేవరకొండ రోడ్డులో మండలంలోని 9 తండాలకు చెందిన గిరిజనుల ముఖ్య నాయకులు ఆదివారం సమావేశమయ్యారు. ఫిబ్రవరి 15న సేవాలాల్ జయంతిని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ తండాలకు చెందిన ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

చారకొండ: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చంద్రాయన్‌పల్లిని ఆయన సందర్శించారు. అనంతరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. పదవీకాలం పూర్తి చేసుకున్న సర్పంచ్ వసంతతోపాటు వార్డు సభ్యులను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామం నుంచి మండల కేంద్రం వరకు బీటీ రోడ్డు, చెరువు మరమ్మతులపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, ఉప సర్పంచ్ పర్వతాలు, దేవాలయ చైర్మన్ సీతారాం రెడ్డి, కమిటీ సభ్యులు, యువ నాయకులు శంకర్, నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఉన్నారు.



ఎమ్మెల్యే కసిరెడ్డిని సన్మానిస్తున్న సర్పంచ్

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాల, ఎస్సీ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని బీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. ఆదివారం గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, క్రీడామైదానాలు ఏర్పాటు చేయాలని కోరారు. హాస్టళ్లలో మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాలని, వాటర్‌ప్లాంట్ వద్ద అపరిశుభ్రత వాతావరణ నెలకొందన్నారు. కార్యక్రమంలో మల్లయ్య, అరుణ, సురేష్, రాము, శివశంకర్ పాల్గొన్నారు.

డ్రోన్ యంత్రంపై అవగాహన



తాడూరు: మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న పథకాలపై ఆదివారం రైతులకు ఏఓ సాయిరమేష్‌కుమార్ అవగాహన కల్పించారు. డ్రోన్ యంత్రం ద్వారా పంటలకు పిచికారి చేసే విధానాన్ని వివరించారు. డ్రోన్ యంత్రాలను రైతులు కొనుగోలు చేసేందుకు బ్యాంకులు రుణాలు ఇస్తారని పేర్కొన్నారు. అధునాతనమైన యంత్రాలను కొనుగోలు చేసి పంట ఖర్చు తగ్గించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. నూతన టెక్నాలజీని రైతులు అందిపుచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

తెలకపల్లి: మండల కేంద్రంలోని మండల కాంప్లెక్స్ మీటింగ్ హాల్‌లో ఈ నెల 30వ తేదీన ఎంపీపీ కొమ్ము మధు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

చారకొండ: మండల కేంద్రంలో రైతువేదికలో ఎంపీపీ నిర్మల అధ్యక్షతన ఈనెల 31న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ వెంకటేష్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా అచ్చంపేట్ ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతారని తెలిపారు.

బోరు డ్రిల్లింగ్



కల్వకుర్తిరూరల్: మండలంలోని తాండ్ర గ్రామ పంచాయతీ పరిధిలో 6వ వార్డు ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆశాదీప్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి ఆదివారం గ్రామంలో రూ.90వేలు ఖర్చు చేసి తాగునీటి బోరు డ్రిల్లింగ్ చేయించారు. దీంతో పుష్కలంగా నీరు వచ్చింది. తాగునీటి సమస్య తీరడంతో గ్రామస్తులు ఆశాదీప్‌రెడ్డిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులు అశోక్, హరీష్, సుభాష్, ఆంజనేయులు, సందీప్, రామస్వామి, బాలకిష్టయ్య, నందు యాదవ్ తదితరులు ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కల్వకుర్తి టౌన్: పట్టణంలో పలు వార్డులలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నారాయణరెడ్డి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను నిర్వహిస్తారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలోని కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అద్దంకి దయాకర్‌కు సముచిత స్థానం కల్పించాలి



కల్వకుర్తిరూరల్: కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచిన అద్దంకి దయాకర్‌కు సముచిత స్థానం కల్పించాలని మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు రావుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో మాల మహానాడు ప్రధాన కార్యదర్శి మురళీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ బలోపేతానికి పనిచేసిన అద్దంకి దయాకర్‌కు తగిన గుర్తుంపు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అజయ్‌కుమార్, శేఖర్, రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని కొనసాగించాలి



తెలకపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తాత్కలికంగా ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను నిరంతరం కొనసాగించాలని మండల ప్రజలు కోరుతున్నారు. రేషన్‌కార్డు కోసం కేవైసీ చేసుకునేందుకు రేషన్ కార్డులో ఉన్న చిన్నపిల్లలకు ఆధార్ అప్‌డేట్ లేకపోవడంతో రేషన్ కార్డు కేవైసీ చేసుకోలేకపోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 25, 27 తేదీలలో తాత్కాలిక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని శాశ్వత ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

అచ్చంపేట రూరల్: నూతనంగా నియమించబడ్డ ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రమావత్ సంతోష్‌ను ఆదివారం పట్టణంలో పలు సంఘాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. మున్ముందు మరిన్ని పదవులు పొందాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు కపిలవాయి చంద్రమోహన్, నాయకులు కాశన్నయాదవ్, మల్లికార్జున్, రఘురాం, అజయ్, మహేష్, రాజ్‌గోపాల్, రాజేంద్రప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యశ్వంత్

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామానికి చెందిన నల్లవెల్లి యశ్వంత్‌ను ఎస్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకోవడంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో యశ్వంత్ మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు ధన్యవాదాలు తెలిపారు. అంకితభావంతో బాధ్యతలు నిర్వర్తిస్తానని ఆయన పేర్కొన్నారు. కార్తిక్, ఉదయ్, ప్రశాంత్‌లు ఉన్నారు.



సంతోష్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎంపీ లక్ష్మణ్‌ను కలిసిన శ్రీనిధి ఉద్యోగులు



కందనూలు: శ్రీనిధి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతూ ఆదివారం హైదరాబాద్‌లో ఎంపీ లక్ష్మణ్‌ను శ్రీనిధి ఎంప్లాయ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు నాగపూరి రాములు, కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం అయ్యే దిశగా రుణాలు మంజూరు చేస్తున్న శ్రీనిధి సంస్థలో ఉద్యోగులు అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నారని వివరించారు. సంస్థలో పనిచేసే సిబ్బందికి పే స్కేల్ అమలు, క్యాడర్ ఫిక్సేషన్ జరిగేలా, సంస్థను పూర్తిస్థాయిలో ప్రభుత్వంలో విలీనం చేసేందుకు అవకాశాలను పరిశీలించాలని వారు కోరారు.

ఉచితంగా గురుకుల మెటీరియల్ పంపిణీ

కందనూలు: జిల్లా కేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురుకుల కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు తెనుగోళ్ల విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పెబ్బేటి మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షుడు ఆంజనేయులు, రాములు, రాజు, బాలరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.